ప్రజాశక్తి
శనివారం 4 జనవరి 2025

భూ ఆక్రమణపై విచారణ

ప్రజాశక్తి అనంతగిరి:మండలంలోని నాన్ షెడ్యూల్ పంచాయతీ పరిధి సరియాపల్లి ప్రభుత్వ డి పట్టా భూముల ఆక్రమణకు గురవుతున్నాయని సిపిఎం నాయకులు జేష్ఠ. వెంకటరమణ, ఆర్ .శ్రీను ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ విఆర్ఓ బాస్కరరావు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ, సరియాపల్లి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 56లో 13 ఎకరాలు, సర్వే నెంబర్ 51 నుండి 56, 57. గెడ్డ పోరబోకు భూములు భూ స్వాములు ఆక్రమించారన్నారు.

పరిశీలిస్తున్న రెవిన్యూ అధికారులు

సజావుగా పీసా కమిటీ ఎన్నికలు

చింతపల్లిలో ఎన్నిక నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-చింతపల్లి: పిసా ఎన్నికలలో కూటమి పార్టీల మధ్య గట్టి పోటీ ఏర్పడింది. జిల్లా పరిషత్ పాఠశాల అవరలో గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమన్నత పాఠశాల-2 ప్రధానోపాధ్యాయుడు, పిసా పోలింగ్ అధికారి పలాసి పండన్న, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత సమక్షంలో శుక్రవారం పీసా ఎన్నికలు జరిగాయి. ఎన్డీఏ కూటమి తెలుగుదేశం పార్టీ నాయకుడు దూరి రామకృష్ణకు 134 ఓట్లు పోలయ్యాయి. భారతీయ జనతా పార్టీ నుండి పోటీ చేసిన కదుళ్ళు శ్రీనివాసరావు 96 ఓట్లు పోలాయి. దీంతో దూరి రామకృష్ణ విజయం ఖాయమైంది.

పీసా కార్యదర్శిగా జనసేన పార్టీ నుంచి సుర్ల వీరేంద్ర కుమార్‌కు 15 ఓట్లు పోలయ్యాయి. ఇండిపెండెంట్ నుండి పోటీ చేసిన ముత్యం సత్యనారాయణ 171 ఓట్లు పోలు కావడంతో విజయం సాధించారు. ఈ ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. అవాంఛనీయ సంఘటనలు చోటుచసుకోకుండా పోలీస్ సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. పిసా ఎన్నికలలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, పీసా అసిస్టెంట్ పోలింగ్ అధికారులు సిహెచ్ సతీష్ కుమార్, పి చిన్ని బాబు, తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్ పాల్గొన్నారు.

అనంతగిరి:పీసా కమిటీ ఎన్నికలు మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ సోమ్మెల. రూతు ఆధ్వర్యంలో జరిగాయి. లక్ష్మీపురం, అనంతగిరి, రేగం పరిధిలో జరిగిన ఎన్నికలలో జడ్పిటిసి దిసరి. గంగరాజు, ఎంపీపీ శెట్టి నీలవేణి హాజరయ్యారు.అనంతగిరిలో పీసా కమిటీ సెక్రెటరీగా ఎన్నికైన కొండలరావుకు ధ్రువ పత్రం అందజేశారు.

జి.మాడుగుల:స్థానిక సచివాలయం ఆవరణలో గ్రామ సర్పంచ్ కిముడు రాంబాబు అధ్యక్షత పీసా కమిటీ ఎన్నికలు తహసీల్దార్ లత్సా పాత్రుడు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ ఎన్నికకు ఉపాధ్యక్ష, కార్యదర్శి ఎన్నికకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఈ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి.

ఉపాధ్యక్షుడు గా కీముడు మణికంఠ, కార్యదర్శి గా కూడా విజయ్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు తహసీల్దార్ ప్రకటించారు. ఎన్నికైన ఉపాధ్యక్ష కార్యదర్శి గ్రామ సభకు హాజరైన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.ఎన్నిక అయిన వారిని అభినందనలు తెలిపారు.ఎన్నికైన ఉపాధ్యక్ష కార్యదర్శులకు తహసీల్దార్, సర్పంచ్ చేతులు మీదుగా ఎన్నిక పత్రాలు అందజేశారు.ఇందులో భాగంగా పిజి మాడుగుల క్లస్టర్ లో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్ష, కార్యదర్శులకు ఎన్నిక నిర్వహించగా ఇక్కడ ఒక్కక్కటే నామినేషన్ దాఖలు చేశారు.దీంతో ఇక్కడ కూడా ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్ష పదవికి సళ్ళంగి హేమంత్ ప్రసాద్, కార్యదర్శిగా లోచలి వెంకటేష్ ప్రసాద్ ఎన్నిక అయినట్లు ఎంపిడిఓ ప్రకటించారు.ఎన్నిక పత్రాలు సర్పంచ్ చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కీముడు కళ్యాణం,రెడ్డిబాబు, నాగబ్బాయి,మత్స్యరాజు, నారాయణ రాజు, నుర్మని మత్య కొండం నాయుడు, పంచాయతీ గ్రామస్తులు పాల్గొన్నారు.

పలు పంచాయతీల్లో పీసా ఎన్నికలు వాయిదా

కొయ్యూరు : మండల కేంద్రం కొయ్యూరు, రాజేంద్రపాలెంతో పాటు పలు పంచాయతీల్లో పీసా కమిటీ ఎన్నికలు వాయిదా పడ్డాయని ఎన్నికల అధికారి తెలిపారు. కొయ్యూరు పంచాయితీలో 1197 మంది ఓటర్లు ఉండగా నిబంధన ప్రకారం 1/3వ వంతు అంతే 399 మంది ఓటర్లు హాజరు కావాల్సి ఉందని పేర్కొన్నారు. కాని 111 మంది మాత్రమే వచ్చారని, గ్రామసభ కోరానికి సరిపడా ఓటర్లు రాకపోవడంతో ఇరుపక్షాలు అంగీకారంతో వాయిదా వేసినట్లు తెలిపారు. అయితే చిట్టెంపాడు, బాలారం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు చెప్పారు.

సీలేరు:జీకే వీధి మండలం సీలేరులో పీసా కమిటీల ఎన్నికలు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం స్పెషల్ ఆఫీసర్ డివి.కాళేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరిగాయి. సీలేరు గ్రామపంచాయతీ క్లస్టర్ ఒకటి పీసా కమిటీ కార్యదర్శిగా కిముడు చిరుపతి, ఉపాధ్యక్షులుగా కిల్లో మనోజ్ కుమార్, క్లస్టర్-2 టిఆర్‌సిలో కార్యదర్శిగా సీసా ధను, ఉపాధ్యక్షులుగా గొల్లూరి స్వప్న ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి ధ్రువీకరణ పత్రాలు స్పెషల్ ఆఫీసర్ డివి కాళేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసా కమిటీ హక్కులు, చట్టాలను గిరిజనలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాటు సారా, గంజాయి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి దుర్జు, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, పంచాయతీ కార్యదర్శి పరశురాం, ఉప సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, టిడిపి కూటమి నాయకులు చిటికెల రాముబాలు, ముంది, కె.అప్పలరాజు, నూకరాజు, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, డ్వాక్రా సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికైన సభ్యులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గ్రామ వాలంటీర్ల దీక్షను ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ

విధుల్లోకి తీసుకోవాలని వాలంటీర్ల దీక్షలు

ప్రజాశక్తి-రంపచోడవరం

తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గ్రామ వాలంటీర్లు ఎపి గ్రామ/వార్డు వాలంటీర్ల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయం ఎదుట శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వాలంటీర్లకు గౌరవేతనంగా రూ.10వేలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా వాగ్దానం చేసిన చంద్రబాబునాయుడు, కూటమి నాయకులు, అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా నేటికీ వారిని విధుల్లోకి తీసుకోకపోవడం దారుణమన్నారు. పైగా ఉపముఖ్యమంత్రి, మంత్రులు అసలు వాలంటీర్ వ్యవస్థ అనేది లేదని మాట్లాడుతున్నారని, వ్యవస్థే లేకుంటే ఎవరి కోసం వాగ్దానాలు చేశారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాజీనామా చేసిన వాలంటీర్లతో సహా వాలంటీర్లు అందరినీ కొనసాగించాలని, బలవంతంగా రాజీనామా చేయించిన వారిపై చట్టపరమైన చర్య తీసుకోవాలని, వాలంటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏడు నెలలు పెండింగ్ వేతన బకాయిలు చెల్లించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి సవలం సుబ్రహ్మణ్యం, జిల్లా నాయకులు కుంజం భానుప్రియ. ఎం,కామేశ్వరి. జె,దేవి, అధిక సంఖ్యలో వాలంటీర్లు పాల్గొన్నారు.

విజయవాడ-సీలేరు బస్సును రెగ్యులర్‌గా నడపాలి

ప్రజాశక్తి-సీలేరు : విజయవాడ నుండి సీలేరుకు బస్సు సర్వీసును రెగ్యులర్‌గా నడపాలని ఈ ప్రాంత ప్రజలు, ప్రయాణికులు ఆర్టీసీ అధికారులును కోరుతున్నారు. విజయవాడ నుండి వయా భద్రాచలం, చింతూరు, మోతుగూడెం మీదగా సీలేరుకు రెండు బస్ సర్వీసును కొన్ని సంవత్సరాలుగా నడుపుతున్నారు. ఇటీవల సీలేరు నుంచి విజయవాడ వెళ్తుండగా బస్సు ప్రమాదానికి గురైన నేపథ్యంలో బస్సు నిలిపివేశారు. అప్పటి నుండి ఒక బస్సు సర్వీసును రోజు విడిచి రోజు నడుపుతున్నారు. దీంతో సీలేరు, డొంకరాయి, పొల్లూరు, మోతుగూడెం, చింతూరు, ఈ పరిసర గ్రామాలు, సరిహద్దు రాష్ట్రాల ప్రజలు, ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. సంక్రాంతి పండగ సమీపిస్తుండడంతో దూర ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వచ్చే వారు, బంధువులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు నానా అవస్థలకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి రెగ్యులర్‌గా విజయవాడ నుండి సీలేరుకు బస్సు సర్వీసులు నడపాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

అరకు ఉత్సవ ఏర్పాట్లు వేగవంతం చేయండి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని అన్ని పర్యాటక ప్రాంతాలలో ఉన్న సౌకర్యాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్ నుండి పర్యాటక రంగంపై నిర్వహించిన విసిలో కలెక్టర్ మాట్లాడుతూ, పర్యాటక ప్రాంతాలలో ఎంట్రీ, స్టాల్స్ ఫీజులపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పంచాయతి రాజ్, ఐటిడిఎ, పంచాయతీలు, రెవిన్యూ, సంఘాలు, తదితర సంస్థలు చేస్తున్న వసూళ్ళలో ఆ మొత్తం క్రెడిట్ అవుతున్న ఖాతాలు, వారు కల్పిస్తున్న లైటింగ్, త్రాగు నీరు, మరుగుదొడ్లు, రిఫ్రెషింగ్ కౌంటర్లు వంటి సేవలు, పూర్తి నివేదికలు అందించాలన్నారు. త్వరలో చలి పేరుతో నిర్వహించనున్న అరకు ఉత్సవంకు ఏర్పాట్లు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మూడు రోజుల పాటు భారీగా నిర్వహించనున్న అరకు ఉత్సవ్ కు వివిధ రాష్ట్రాల నుండి గిరిజిన కళాకారులను తెప్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మణిపూర్, ఒడిష, తెలంగాణా, పాండిచేరి, తదితర రాష్ట్రాల నుండి గిరిజన సాంప్రదాయ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మారథాన్, కార్నివాల్, బొర్రా నుండి అరకు వేదిక వరకు ప్రొఫెషనల్స్ తో సైక్లింగ్, మొక్కలు నాటే కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అరకు ఉత్సవ బ్లాగ్ ఏర్పాటు చేసి ప్రోమోతో పాటు ఎప్పటికప్పుడు కార్యక్రమాలను అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. ఈవెంట్లకు సంబంధించి క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేయాలని, ప్రోమో తయారు చేసి ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ఫుడ్ కోర్ట్స్, టూరిజం బ్రోచర్లు, ట్రైబల్ ఫేషన్ షో, యోగ తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. హాట్ ఎయిర్ బెలూన్ వంటి సాహస క్రీడలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ విసిలో కలెక్టర్ చాంబర్ నుండి సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డి.ఆర్.ఓ పద్మలత, వర్చువల్ విధానంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, టూరిజం డివిజినల్ మేనేజర్ పి.జగదీశ్వరరావు, అల్లూరి సీతారామరాజు స్మారక మ్యూజియం క్యూరేటర్ శంకర్‌రావు, జిల్లా టూరిజం అధికారి జి. దాసు, గిరిజన మ్యూజియం క్యూరేటర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

మైనర్లకు హోటల్స్‌లో గదులు కేటాయించొద్దు

ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు ఐటిడిఏ పరిధిలోని హోటళ్లు, రిసార్టులలో మైనర్ బాల బాలికలకు గదులు కేటాయించ వద్దని ఐటిడిఏ పి.ఓ. వి. అభిషేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేసారు. అపరిచితుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. హెూటళ్లు, రిసార్టులలో మైర్లకు గదులు కేటాయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. వీరికి హెూటళ్లలో గదులు కేటాయించడం చట్టరీత్యా నేరమన్నారు. అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి వచ్చినా, ఒంటరిగా వచ్చినా ఏజెన్సీలోని హెూటళ్లు యజమానులు గదులు కేటాయించకూడదని సూచించారు. తల్లిదండ్రులతో కలసి వస్తే పూర్తి వివరాలను సేకరించి గదులు కేటాయించాలని పేర్కొన్నారు. వివరాలు తీసుకుని సక్రమంగా ఉన్నాయని దృవీకరించుకున్న అనంతరం గదులు కేటాయించాలన్నారు. బాల బాలికలకు గదుల కోసం మస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించాలని చెప్పారు. హెూటళ్లు, రిసార్టులలో మైనర్లకు గదులు లేవని నోటీసు బోర్డులో పెట్టాలన్నారు.

చదవలేదని కొట్టడంతో విద్యార్థికి గాయాలు

ప్రజాశక్తి- హుకుంపేట: స్కూల్ లీడర్ కొట్టడంతో ఓ విద్యార్థి అస్వస్థతకు గురైన సంఘటన మండలంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలలో రాత్రి 9 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. స్టడీ అవర్ సమయంలో తొమ్మిదవ తరగతి స్కూల్ లీడర్ తోటి విద్యార్థి 8వ తరగతి స్టీఫెన్‌ను చదువుకోలేదని గట్టిగా కొట్టడంతో నరాల పైన దెబ్బలు తగిలి అస్వస్థతకు గురయ్యాడు. పాఠశాల నుంచి తల్లిదండ్రులకు ఫోన్ రావడంతో వారు మీడియాకు విషయాన్ని అందించారు. వారెన్ల పర్యవేక్షణలోపం కారణంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తల్లిదండ్రులు తెలిపారు. వార్డెన్లు రాత్రిపూట పాఠశాలలో నివాసం ఉండక పోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని వాపోతున్నారు. వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

ఆసుపత్రికి తీసుకెళుతున్న విద్యార్థులు

'మీ కోసం'కు హాజరు కాకుంటే షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-పాడేరు : ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, మీ కోసంకు హాజరు కాకుంటే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేధికలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డి.ఆర్.ఓ. కె. పద్మలతతో కలిసి వివిద మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 52 వినతులను స్వీకరించారు. జిల్లా అధికారులు కొంత మంది మీకోసం కార్యక్రమానికి హాజరు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. ముందస్తు అనుమతి లేకుండా మీకోసంకు శాఖాధికారులు గైరుహాజరైతే షోకాజ్ నోటీస్ జారీ చేస్తామని హెచ్చరించారు. పదే పదే పునరావృతమవుతున్న ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఇఇ టి.కొండయ్య పడాల్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్‌రావు, ఐసిడిఎస్ పి.డి. ఎన్.సూర్యలక్ష్మి, జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా, ఐటిడిఏ పరిపాలనాధికారి ఎం.హేమలత, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ జవహార్ కుమార్, జిల్లా ఖజానాధికారి ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

శిశు ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి

పాడేరు : జిల్లాలో ఏర్పాటు చేస్తున్న శిశు ఆధార్ కేంద్రాల సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ విజ్ఞప్తి చేసారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్ లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో శిశు అదార్ బ్యానర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సున్నా నుండి ఐదు సంవత్సరాల పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో ఆధార్ కోసం నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ శిశు ఆధార్ కేంద్రాల సేవలు అన్ని ప్రాంతీయ ఆసుపత్రులు, ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్ వాడి కేంద్రాలలో ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ భాష, విరించి సంస్థ ప్రతినిధులు మూర్త శ్రీను, గూడవల్లి ప్రదీప్ కుమార్, ఉప్పు నాగేశ్వర రావు, శిశు ఆదార్ కో-ఆర్డినేటర్ బివివి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆసుపత్రికి వచ్చేందుకు నిండు గర్భిణి నిరాకరణ

- వైద్యాధికారి కౌన్సిలింగ్ చేసి హాస్పిటల్‌కు తరలింపు
- సుఖ ప్రసవం
- ఆడబిడ్డ జననం

ప్రజాశక్తి-సీలేరు

నెలలు నిండిన గర్భిణి ఆసుపత్రికి వచ్చేందుకు నిరాకరించింది. ఆశా కార్యకర్త చేసిన ప్రయత్నం ఫలించలేదు. ప్రసవ సమయం దగ్గర పడుతుండడంతో వైద్యాధికారి స్వయంగా గ్రామాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ చేసి గర్భిణిని ఆసుపత్రికి తరలించి సుఖ ప్రసవం చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి....

దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దారపుడి గ్రామంలో గర్భిణి పాంగి లక్ష్మికి నెలలు నిండడంతో ప్రసవం కోసం ఆసుపత్రికి తీసుకొని రావాలని ఆశా కార్యకర్తను వైద్యాధికారి డీకే హిమబిందు గ్రామానికి పంపించారు. గర్భిణి లక్ష్మిని ఆసుపత్రికి తరలించేందుకు రెండు రోజులుగా ఆశా కార్యకర్త ప్రయత్నిస్తున్నా కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. ఈ విషయాన్ని వైద్యాధికారి హిమబిందుకు తెలియజేయగా, శుక్రవారం ఆమె వైద్య సిబ్బందితో గ్రామానికి బయలు దేరి, దారాలమ్మ దేవాలయం నుంచి రెండు కిలోమీటర్లు కాలినడకన ఆ గ్రామానికి వెళ్లారు. గర్భిణి పాంగి లక్ష్మిని పరీక్షించారు. గర్భిణి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి గర్భిణీ ప్రసవ సమయానికి 10 రోజు ముందు ఆసుపత్రిలో చేరాలని సూచించారు. గృహంలో ప్రసవం పొందడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యానికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని, ఆసుపత్రిలో ప్రసవం తల్లీ బిడ్డకు క్షేమమని తెలిపారు. దీంతో గర్భిణి కుటుంబ సభ్యులు అంగీకరించడంతో లక్ష్మిని కొంత దూరం ద్విచక్ర వాహనంపై తీసుకొచ్చి, అక్కడ నుండి అంబులెన్స్‌లో దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. శుక్రవారం సాయంత్రం లక్ష్మి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అలాగే వైద్యాధికారి గ్రామంలో బాలింతలు, చిన్నారులకు వైద్యాధికారి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు శోభా, ఈశ్వరి, పారా మెడికల్ సిబ్బంది బాలకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

కాలినడకన గ్రామానికి వెళ్తున్న వైద్యాధికారి, సిబ్బంది

గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ హిమబిందు

జైపాల్ సింగ్ ముండాకు ఘన నివాళి

ప్రజాశక్తి-దేవీపురం

భారత రాజ్యాంగ సభ సభ్యుడు, ఆదివాసీ మహాసభ వ్యవస్థాపకులు జైపాల్ సింగ్ ముండా 122వ జయంతి వేడుకలు దేవీపట్నం మండలం ఇందుకూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. జైపాల్ సింగ్ ముండా చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు అయినాపురపు సూర్యనారాయణ, ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ జైపాల్‌సింగ్ ముండా విద్యావేత్తగా, క్రీడాకారునిగా, ఉద్యమకారునిగా, రాజకీయ నాయకునిగా, భారత రాజ్యాంగసభ సభ్యునిగా జీవితాంతం ఆదివాసీల హక్కుల కోసం పోరాడినట్లు చెప్పారు. ఆయన ఉద్యమ స్ఫూర్తి నేటి తరం యువతీ యువకులకు ఆదర్శనీయమన్నారు. జైపాల్ సింగ్ ముండా పోరాట స్ఫూర్తితో పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి, ఆదివాసీ నాయకులు యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్న దొర, అరగాటి వీరభద్రరెడ్డి, చెదల నాగిరెడ్డి, కెచ్చేల అబ్బాయిరెడ్డి, మామిడి చిన్నారెడ్డి, పూనెం విష్ణు, మడకం చంద్రరావు, గడుతూరి చిన్నారావు, ముర్రం పెంటన్న దొర, నడిపూడి భాను శంకర్ రెడ్డి, మడకం శంకరమ్మ, నడిపూడి గాంధీ రెడ్డి, మద్దేటి సతీష్, సింబోతుల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జైపాల్ సింగ్ ముండాకు నివాళులర్పిస్తున్న దృశ్యం

పోలవరం నిర్వాసితుల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం

రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి

ప్రజాశక్తి-రంపచోడవరం

పోలవరం నిర్వాసితుల సమస్యల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. రంపచోడవరం ఆర్వి రెసిడెన్సీలో శుక్రవారం ఆమె పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని సమస్యలు పరిష్కార దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో పోలవరం నిర్వాసితుల సమస్యలను తెలియజేసినట్లు చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించి సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్నటువంటి బిల్లులను మంజూరు చేయడానికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే శుక్రవారం దేవీపట్నం మండలంలో 567 కుటుంబాలకు రూ.3745.86 లక్షలు నిధులు వారి బ్యాంకు ఖాతాకు జమ చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు మఠం విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ, చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

దేవీపట్నం : దేవీపట్నం ఆర్ అండ్ ఆర్ కాలనీలో పోలవరం నిర్వాసితులు దేవీపట్నం సర్పంచి కుంజం రాజామణి ఆధ్వర్యంలో ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్ర పటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పోలవరం నిర్వాసితుల కమిటీ సభ్యులు గేదెల పెద్ద సుబ్బారావు మాట్లాడుతూ దేవీపట్నం మండలం పోలవరం నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, సొంతంగా ఇల్లు నిర్మించుకుంటున్న 567 కుటుంబాలకు రూ.3,74,586 సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం, గోకవరం గంగాలమ్మ తల్లి ఆలయ సమీపంలో ఉన్న దేవీపట్నం పూడిపల్లి కాలనీ నిర్మాణం పనులను పున:ప్రారంభించిన నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో పోలవరం నిర్వాసితులకు చాలా అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు లంక హరిబాబు, గేదెల చిన్న సుబ్బారావు, దొడ్డ సింహాద్రి, తిరుమల శెట్టి శ్రీనివాసు, కూటమి నాయకులు, పోలవరం నిర్వాసితులు పాల్గొన్నారు.

పోరాడే అభ్యర్థులను పీసా కమిటీకి ఎన్నుకోవాలి

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి - చింతపల్లి : గిరిజనులకు భారత రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులకై పోరాడే అభ్యర్థులను మాత్రమే పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులుగా ఎన్నుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం చింతపల్లి మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి సూచించారు. మండలంలోని చౌడుపల్లి పంచాయతీ వాముగెడ్డ గ్రామంలో ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలోని పీసా గ్రామ సభలను ఉల్లంఘించి గత వైసిపి ప్రభుత్వం చేసుకున్న హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందం ప్రస్తుత ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం కూడా కొనసాగిస్తుందన్నారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న ప్రయత్నాలను ఆదివాసులు అడ్డుకోవాలన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకొని గిరిజన ప్రాంత ప్రజల హక్కులు, చట్టాలు శత శాతం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీసా చట్టం. హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ సభ్యులు కిలో సింహాచలం, కోర్ర చిట్టిబాబు, కిలో పరమేశ్వరావు, వంతల ప్రహల్లాద్, రామకృష్ణ, సాగిన అచ్యుత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు

మాట్లాడుతున్న ఎంఇఒ భారతీరత్నం

1**ప్రజాశక్తి-అరకులోయ:**అరకు వేలిలో ఫౌండేషనల్ లెట్రిసి అండ్ న్యూమరాసి(ఎఫ్ఎల్ఎన్) శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక మండల విద్యాశాఖ అధికారిణి పి. భారతి రత్నం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉపాధ్యాయులు శిక్షణ పొందడంతో విద్యార్థులకు మరింత ఉత్తమమైన విద్యను అందించవచ్చునన్నారు. సమగ్ర శిక్ష అకాడమీ మానిటరింగ్ అధికారి భాస్కరరావు మాట్లాడుతూ, ఈ శిక్షణ ఉపాధ్యాయులకు విద్యా విధానంలో మార్పులను చేపట్టే సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. పిల్లల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో సహాయపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ వి. వెంకన్న , సీఆర్పీలు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి -ఆనందపురం : వ్యక్తి అదృశ్యంపై శుక్రవారం ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. వివరాలివి. చందక పంచాయితీ ఎడ్ల వారి కల్లాలు చెందిన తాడ్డి వెంకటరావు ఆర్థిక సమస్యలతో మద్యానికి బానిసై, మూడు నెలలుగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలోబయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన వెంకటరావు, తిరిగి రాకపోవడంతో భార్య కుమారి బంధువులకు సమాచారం అందించి, చుట్టుపక్కల వెతికినప్పటికీ ప్రయోజనం లేదు.దీంతో ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. సిఐ చింత వాసునాయుడు ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ గాంధీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని శారదా నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం సావిత్రి భాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటాన్ని పూలమాలలు వేసి నివాళి అర్పించారు.పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ మత్స్యరాజు మాట్లాడుతూ, దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలే పేరు పొందారన్నారు..ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దొన్ను పాల్గొన్నారు.

అనంతగిరి:కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటాన్ని యుటిఎఫ్ ఆధ్వర్యాన పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సహ అధ్యక్షులు వివి ఉషారాణి, యుటిఎఫ్ ఉమ్మడి జిల్లా సహ అధ్యక్షులు శెట్టి రాంబాబు, మండల యుటిఎఫ్ ప్రతినిధులు జి.శాంతి, ఎస్ .రాంబాబు, లక్ష్మి, భారతి, .కళ్యాణి, సాద్విని, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

శారదా నికేతన్‌లో పూలేకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

యుటిఎఫ్ ఆధ్వర్యాన ..

రాజవొమ్మంగిలో యుటిఎఫ్ ఆధ్వర్యాన పూలేకు నివాళి

రాజువొమ్మంగి : భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం యుటిఎఫ్ మహిళా అధ్యక్షురాలు కోడూరు లోవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా కౌన్సిలర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్త్రీ అభ్యుదయానికి, బాలికల విద్యకు శ్రీకారం చుట్టారని, బాల్యవివాహాలు, మూఢనమ్మకాలు, సతీసహగమనం వంటి దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. యుటిఎఫ్ మహిళా కార్యదర్శి టివిఎల్.ప్రసన్న ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు కారం రాంబాబు, అధ్యక్షులు పీవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కానెం శ్రీను, జిల్లా కార్యదర్శులు ఎం రమేష్ బాబు, తీగల బొజ్జియ్య, మండల కార్యదర్శి సత్యబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంపచోడవరం : మండలంలోని ఇర్లపల్లి ఆశ్రమ పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యాన జరిగిన సావిత్రి బాయ్ పూలే జయంతి వేడుకల్లో ఆమె చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఎస్.రాజేశ్వరి మాట్లాడుతూ పూలే కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి అని పేర్కొన్నారు. విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె, తమ జీవిత కాలంలో 54 పాఠశాలలను స్థాపించినట్లు చెప్పారు. కుల వ్యవస్థ, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రులు, అస్పృశ్యులు, మహిళల హక్కుల కోసం కృషి చేశారని తెలిపారు. యుటిఎఫ్ మహిళా కార్యదర్శి కె.సత్యవేణి, ఎం వెంకటలక్ష్మి, మండల అధ్యక్షులు సిహెచ్‌ఆర్ సనాతన బాబు, ప్రధాన కార్యదర్శి ఎన్ వెంగళరావు, సీనియర్ ఉపాధ్యాయురాలు ఎస్ కళావతి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

అడ్డతీగల : స్థానిక ఎంఆర్‌సిలో యుటిఎఫ్ మహిళా కార్యదర్శి జెబివి.రమణమ్మ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏజెన్సీ డిఇఒ వై.మల్లేశ్వరరావు, ఎంఇఒ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండలంలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు ఎం.పాపయమ్మ, సిహెచ్.నరసింగరావు, ఎల్.జేజిబాబు, జె.త్రివేణి, ఎస్.లక్ష్మీనారాయణ, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జి.తేజోరావు, ఎం.ఆనంద బాబు, సిహెచ్.బాబు వరప్రసాద్, రంపచోడవరం డివిజన్ ఉత్తమ ఉపాధ్యాయులు డి.శాంతిమతి, పి.బాలురెడ్డి, ఎన్.ప్రకాశరావు తదితరులను ఘనంగా సన్మానించారు. యుటిఎఫ్ అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాఘవులు, జిల్లా కౌన్సిలర్ రాంబాబు, మహిళా కార్యదర్శి ప్రభ, నాయకులు తేజ, జగదీష్, పి.రాంబాబు, కె.చిన్నారావు, ఎస్.నాగప్రసాద్, ఎస్ఎస్ఎన్.మూర్తి, బి.దొరబాబు, పి.శేషగిరి, ఎ.శ్యామలాదేవి, ఎం.అపర్ణ, మల్లేశ్వరి, పార్వతి, సూర్యకాంతం, సత్యవతి, సత్యవాణి, గౌతమి, గంగాభవాని, తిరుపతమ్మ పుష్పవాణి, శాంతిమతి, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంపచోడవరంలో సావిత్రిబాయి పూలేకు నివాళులు

అడ్డతీగలలో ఉపాధ్యాయులకు సత్కారం

జిమ్‌సర్‌లో డిఎస్‌ఐ వార్షికోత్సవం

జ్యోతిప్రజ్వలనతో వార్షికోత్సవాలు ప్రారంభిస్తున్న డాక్టర్ గీతాంజలి

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) డివిఎల్, పాథాలజి విభాగాల ఆధ్వర్యంలో డెర్మటోపాథాలజి సొసైటి ఆఫ్ ఇండియా (డిఎస్ఐ) 27వ వార్షిక సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. .జిమ్‌సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి జ్యోతిప్రజ్వలనతో సమావేశాలను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, వైద్య విద్యార్థులు, అధ్యాపకులలో నూతన పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవడానికి సమావేశాలలో నిపుణుల ప్రసంగాలు ఉపయోగపడతాయన్నారు. సమావేశాల నిర్వహక చైర్‌పర్సన్ డాక్టర్ ఎ.శశికిరణ్ మూడు రోజుల పాటు జరిగే చర్చల వివరాలను వెల్లడించారు. . డిఎస్ఐ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఉమానహర్ వార్షిక నివేదికను సమర్పించారు. జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వసంతకుమార్, గీతం డెర్మటాలజి విభాగాధిపతి డాక్టర్ బివి.రామచంద్ర, పాథాలజి విభాగాధిపతి డాక్టర్ జి.రాజా ప్రమీల పాల్గొన్నారు. వార్షికోత్సవ సమావేశాలకు దేశం నలుమూలల నుంచి 400 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఛాలెంజింగ్ దా డొగ్‌మా అనే అంశంపై జరిగే సమావేశాలలో జాతీయ, అంతర్జాతీయ నిపుణులు మాట్లాడారు. డెర్మటోపాథాలజిలో వస్తున్న వైద్య ప్రగతిపై అవగాహన, చర్చలు జరిపారు. సమావేశాలలో యుకెకు చెందిన డాక్టర్ రిచర్డ్ కార్, డాక్టర్ ఆర్తి భక్షి, అమెరికాకు చెందిన డాక్టర్ మ్యాక్స్‌వెల్ ఫంగ్, డాక్టర్ క్రిస్టీనా ఎలస్‌లను సన్మానించారు. డెర్మాటాలజి పరిశోధనలపై వివరాలను వెల్లడించారు.

ఇంజినీరింగ్ అధ్యాపకులకు ఎన్‌బిఎపై అవగాహన

ప్రజాశక్తి- వేపగుంట : స్థానిక విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బిఎ)పై ఇంజనీరింగ్ అధ్యాపకులకు అవగాహన కల్పించారు. కళాశాల ఇంటర్నల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సెల్ (ఐఒఎసి) ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ మహిళల టెక్నికల్ యూనివర్సిటీ, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రామనారాయణరెడ్డి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి, ఇంజనీరింగ్ అధ్యాపకులకు సిఒ-పిఒ మ్యాపింగ్‌పై అవగాహన కల్పించి, మెళకువలు నేర్పారు.ఎన్‌బిఎలో నూతన విద్యావిధానంలో మార్పు లపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ జి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జివి.ప్రదీప్‌వర్మ, అకడమిక్ డీన్ డాక్టర్ డి.శాంతారావు, ఐఒఎసి కోఆర్డినేటర్ సిహెచ్‌బిఆర్ శ్రీకాంత్, విభాగాధిపతులు, అధ్యాపకులు ,పాల్గొన్నారు.

'అపోలో'లో యువకునికి అరుదైన చికిత్స

ప్రజాశక్తి - ఆరిలోవ : పదేళ్ళగా తరచూ దగ్గు, జ్వరం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, ఎడమ వైపు ఛాతి నొప్పి తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 24 ఏళ్ళ యువకుడికి అపోలో వైద్యులు విజయవంతంగా చికిత్స చేశారు. ఆయా అనారోగ్య సమస్యలతో . ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయంక కాకపోవడంతో అపోలో ఆసుపత్రికి వైద్యానికి వచ్చాడు. డాక్టర్ ఆవాల రవిచరణ్ పర్యవేక్షణలో అపోలో వైద్యులు రోగికి అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. రోగి గతచరిత్రను తెలుసుకునే సమయంలో విద్యార్థిగా ఉన్నప్పుడు ఒక వస్తువు(పెన్, పెన్సిల్ టిప్)ను లోపలకు తీసకున్నట్టు అనుమానంగా చెప్పాడు. దీంతో రోగికి సిటి స్కాన్ చేసారు. ఎడమ కింద లోబ్ సెగ్మంటల్ బ్రాంకస్‌లో ఒక వైపు ఒక చిన్న వస్తువు ఉన్నట్టు గుర్తించారు. బ్రోన్కోస్కోపీ సూట్‌లో అతనికి బ్రోన్కోస్కోపీ టిష్యూ తొలగించారు. దీంతో రోగి ఆరోగ్యం కుదుట పడింది. అత్యాధునిక వైద్య పరికరాలు, పరిజ్ఞానం కలిగిన నిపుణులు ఉన్న అపోలో ఆసుపత్రి యాజమాన్యాన్ని రోగి కుటుంబ సభ్యులు అభినందించారు.

సమీక్ష జరుపుతున్న మంత్రి బాల వీరాంజనేయ స్వామి

ప్రధాని పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 8న జరిగే భారత ప్రధాని పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఏర్పాట్లపై దిశానిర్దేశం చేసే నిమిత్తం ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ మీటింగు హాలులో అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక దేశ ప్రధాని మొట్టమొదటి సారిగా రాష్ట్రానికి విచ్చేస్తున్నారని, ఈ నేపథ్యంలో అందరూ బాధ్యతతో మెలగాలని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు రెండు లక్షల మంది ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారని, ఆ మేరకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రియల్ టైం లొకేషన్ సమాచారం ఉండేలా సిసి టీవీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రధాన వేదిక వద్ద, రోడ్ షో జరిగే ప్రాంతాల్లో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో భాగంగా ప్రధాని కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఇప్పటి వరకు చేపట్టిన చర్యల గురించి, ప్రధాని పర్యటన షెడ్యూల్ గురించి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వివరించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతాపరమైన చర్యల గురించి సిపి శంఖబ్రత బాగ్చీ తెలిపారు. జిల్లా ప్రతినిధులు పర్యటన విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

ఉద్యమాలు, త్యాగాలే.. ఉక్కు సత్యాగ్రహం చిత్రానికి ప్రేరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేందుకు చేసిన ప్రజా ఉద్యమాలు, నాయకుల త్యాగాలే ఉక్కు సత్యాగ్రహం చిత్రానికి ప్రేరణ అని ఆ చిత్ర నిర్మాత, దర్శకుడు, హీరో సత్యారెడ్డి అన్నారు. నగరంలోని చిత్రాలయ ఐనాక్స్‌లో ఉక్కు సత్యాగ్రహం చిత్రాన్ని శుక్రవారం మధ్యాహ్నం సిపిఎం నాయకులు, ఉద్యమ నాయకులు, స్టీల్ ప్లాంట్ నాయకులు, చిత్రంలో నటించిన నటీనటులతో కలిసి వీక్షించారు. అనంతరం సత్యారెడ్డి మీడియాతో మాట్లాడుతూ విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో ఉద్యమకారుల త్యాగాలను ప్రజలకు తెలియజేస్తూ ఈ చిత్రాన్ని నిర్మించామన్నారు. సీనియర్ నటుడు, జివిఎంసి బ్రాండ్ అంబాసిడర్ ప్రసన్నకుమార్, నంది అవార్డు గ్రహీత వినయ ప్రకాష్, ధనుశ్రీ తదితరులు ఇందులో నటించారన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ కానివ్వబోమన్నారు. మీడియా సమావేశంలో సిపిఎం నాయుకులు బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఉక్కు భూ నిర్వాసితుల సంఘం ప్రతినిధి నర్సింగరావు, ఉమ్మడి అప్పారావు, కాంగ్రెస్ నాయుకులు వజ్జిపర్తి శ్రీనివాస్, మజ్జి దేవిశ్రీ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో స్థాయీ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్థాయీ సంఘం సమావేశంలో 42 అంశాలను పొందుపరచగా అన్నింటిపైనా చర్చించినట్టు తెలిపారు. ఒక అంశాన్ని వాయిదా వేశామన్నారు. మిగిలిన 41 అంశాలు ఆమోదం పొందాయన్నారు. ఇంజినీరింగ్ విభాగం, ప్రజారోగ్య విభాగం అభివృద్ధి పనుల అంశాలకు సంబంధించి చర్చ జరిపి ఆమోద ముద్ర వేశామన్నారు.

నేడే నేవీ పండగ

సాగర తీరంలో నావికాదళ విన్యాసాలకు సర్వం సిద్ధం
ముఖ్య అతిథిగా హాజరుకానున్న చంద్రబాబు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ విలేకరి

నేవీ పండగకు విశాఖ సిద్ధమైంది. రాష్ట్రంలో నౌకాదళ దినోత్సవం-2024కు కొనసాగింపుగా శనివారం విశాఖ సాగర తీరంలో నేవీ విన్యాసాలు జరుగనున్న నేపథ్యంలో ఇప్పటికే పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా సిఎం చంద్రబాబు హాజరుకానున్నారు. తూర్పు నౌకాదళం ఏటా డిసెంబరు 4న నిర్వహించే నావికాదళ విన్యాసాలు 2024 డిసెంబర్ 4న ఒడిశాలో జరగ్గా దేశం యావత్తూ తిలకించింది. అయితే విశాఖలోనూ నెల రోజుల వ్యవధిలో వీటిని నిర్వహించాలని సంకల్పించారు. ఈ క్రమంలోనే ఈ నేవీ పండగకు అత్యాధునిక విమానాలు, యుద్ధనౌకలు, ఫ్లై పాక్‌లు సిద్ధమయ్యాయి. మెరైన్ కమోండోల విన్యాసాలతో కనుల పండగకు విశాఖ తీరం వేదిక కానుంది. విన్యాసాలను చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ తిలకించేలా నావికాదళం ఏర్పాట్లు చేస్తోంది. గత ఏడాది ఒడిశాలోని పూరీలో నేవీ వేడుకలు జరగ్గా వాటి కొనసాగింపు వేడుకలు విశాఖలో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి జరుగుతాయని నేవీ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇటీవల జాతికి అంకితం చేయబడిన ఐఎన్ఎస్ నిర్దేశక్ మొదలైనవి పర్యాటకులు, సందర్శకులను అలరించనున్నట్టు తెలిపారు. ఇదిలా ఉండగా నావికాదళ అధికారులు జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగంతో నేవీ డే విన్యాసాల కోసం నిరంతర సమావేశాలు, సమీక్షలు జరుపుతూ పోలీస్, రెవెన్యూ జివిఎంసి, విశాఖ పోర్టు అధికారులను ఇప్పటికే అప్రమత్తం చేశారు.

విశాఖ తీరంలో సిద్ధమైన వేదిక

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

నేవీ విన్యాసాల నేపథ్యంలో శనివారం నేవల్ కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకు నౌకాదళ యుద్ధ విన్యాసాలు జరుగుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వాహనదారులు తగు సూచనలు పాటించాలని నగర పోలీసులు తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్ జంక్షన్ నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ వరకు, నేవల్ క్యాంటీన్ జంక్షన్ నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ వరకు, పంది మెట్ట జంక్షన్ నుంచి నోవోటల్ హోటల్ వరకు, సెంచరీ క్లబ్ నుంచి నోవోటల్ హోటల్ వరకు, సిరిపురం జంక్షన్ నుంచి బీచ్ రోడ్ ఎన్‌టిఆర్ విగ్రహం వరకు, ఆల్ ఇండియా రేడియో జంక్షన్ నుంచి పాండు రంగాపురం జంక్షన్ వరకు పాసెస్ లేని వాహనాలను అనుమతించరు. అలాగే సిరిపురం నుంచి బీచ్ వైపు వచ్చే సాధారణ వాహనదారులు ఆంధ్ర యూనివర్సిటీ ఎగ్జిబిషన్ గ్రౌండ్ లేదా ఆంధ్ర యూనివర్సిటీ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో వాహనాలను పార్కు చేసుకోవాలి. పార్క్ హోటల్ నుండి ఎటువంటి వాహనాలనూ బీచ్ రోడ్డులోకి అనుమతించరు. జోడిగుళ్లపాలెం, ఎంవిపి.కాలనీ, కురుపాం టవర్స్ మీదుగా వచ్చే సాధారణ వాహనదారులు వారి వాహనాలను ఎంజిఎం గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి. జగదాంబ జంక్షన్ నుండి వచ్చే వాహనదారులు, సెవెన్ హిల్స్ హాస్పిటల్ నుండి వచ్చే వాహనదారులు, కెజిహెచ్ వైపు నుండి వచ్చే వాహనదారులు విధిగా సూచనలు పాటించాలి.

ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

నేవీ విన్యాసాల వీక్షణకు సిఎం రాక నేపథ్యంలో ఏర్పాట్లను జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఆర్‌కె బీచ్‌లో ఆయన పలువురు అధికారులతో కలిసి పర్యటించారు. ఎటువంటి లోపాలకూ తావులేకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట అదనపు కమిషనర్లు ఎస్ఎస్.వర్మ, డివి.రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాద్ రాజు. చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకర్ రావు, ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) పిఎం.సత్యవేణి ఉన్నారు.

కార్మికుల నిలుపుదల చట్ట విరుద్ధం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ముందస్తు నోటీసు ఇవ్వకుండా నోటి మాటతో అర్థాంతరంగా జివిఎంసి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను నిలుపుదల చేయడం చట్ట విరుద్ధమని పేర్కొంటూ జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు మాట్లాడుతూ డెత్, రిటైర్మెంట్ అయిన కార్మికుల ఖాళీలను వెంటనే భర్తీ చెయ్యాలని డిమాండ్ చేశారు. 62 సంవత్సరాల రిటైర్మెంట్ వయస్సును కొనసాగించాలన్నారు. అలా కాకుండా అర్థాంతరంగా ఎటువంటి ముందస్తు నోటీసూ ఇవ్వకుండా పారిశుధ్యం, నీటి సరఫరా, ఇతర విభాగాల్లో కార్మికులను నిలిపివేయడం దారుణమన్నారు. వెంటనే వారిని తిరిగి కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఇతర సమస్యలనూ పరిష్కరించాలని కోరారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి 28వ వార్డు పరిధిలోని పలు అభివృద్ధి పనులకు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. సంబంధిత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రవితేజ కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆకస్మికంగా మరణించిన క్లాప్ డ్రైవర్ గండ్రెడ్డి రవితేజ కుటుంబానికి అన్ని విధాలా యూనియన్ తరపున అండగా ఉంటామని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి తెలిపారు. రవితేజ మృతదేహం కెజిహెచ్ మార్చురీలో ఉండగా సంఘ నాయకులతో కలిసి శుక్రవారం వెంకటరెడ్డి అక్కడకు వెళ్లారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. పి.అనిల్ కుమార్, సురేష్, అశోక్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మోతుగూడెం : చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీ పరిధి సుకుమామిడి గ్రామానికి చెందిన బర్రి రాజు అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు తరుపున ఆర్థిక సాయం అందించారు. రాజు మృతితో ఆయన కుటుంబ ఆర్థిక ఇబ్బందులను స్థానికులు ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్‌కు తెలియజేయగా, ఆయన ఆదేశాలతో జెకెసి ట్రస్టు తరుపున రూ.5వేలు మృతుడి భార్యకు ట్రస్టు సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షేక్ రియాజ్, రామారావు, గణేష్, సుకుమారుడి గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశానుసారం తొలగిస్తాం

ప్రజాశక్తి-విఆర్.పురం : ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగిస్తామని మండల తహశీల్దారు సరస్వతి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పైఅధికారుల ఆదేశాలతో ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ స్థలాల్లో ఆక్రమణలు తొలగింపునకు గ్రామ పంచాయతీ సెక్రటరీ, సచివాలయ సిబ్బంది, ఆర్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కొలతలు తీశామన్నారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా వెనక్కి తగ్గాలని, లేకుంటే ప్రభుత్వం, పైఅధికారుల ఆదేశానుసారం చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవిన్యూ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎంసి విధులపై అవగాహన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల (ఎస్ఎంసి) విధులపై స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈఓ కె.సత్యనారాయణదొర స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు చేపట్టవలసిన విధులను గురించి వివరించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. వసతులు, మధ్యాహ్నం భోజనం, విద్యార్థులు బాగోగులు పరిశీలించాలని, పాఠశాలలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 సూరారెడ్డి, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉక్కుపై చంద్రబాబు ఆలోచించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచించాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్ విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నానికి మోడీ వస్తున్నారని, ఆయనతో మాట్లాడి ఉక్కు కర్మాగారాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వర్గీకరణకు అనుకూలంగా ఎపి ప్రభుత్వం తొందరపాటు చర్యలు తీసుకుందని అన్నారు. ఎపిలో వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ వేయడం తప్పని తెలిపారు. విశాఖ నుంచే రోడ్లపైకి ఎస్సీలు రాబోతున్నారన్నారు. శనివారం విశాఖ పర్యటనకు రాబోతున్న చంద్రబాబు ఎస్సీ వర్గీకరణపై స్పందించాలని కోరారు. నిరుద్యోగ సమస్య ఎపిలో తీవ్రంగా ఉందన్నారు. అన్నింటిపైనా దేశంలో పన్నులు వేయడం దారుణమన్నారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అమిత్ షా అవహేళన చేశారన్నారు. అంబేద్కర్‌ను తిట్టేందుకే బిజెపి పుట్టిందా ? అని ప్రశ్నించారు. ఇవిఎంల ట్యాంపరింగ్ వల్లే ఎపిలో, కేంద్రంలో, హర్యానాలో, మహారాష్ట్రలో ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చిందన్నారు. జగన్ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వస్తే ఏమి? రాకుంటే ఏమి?, అది ఆ పార్టీ సొంత నిర్ణయమని అన్నారు.